## క్లుప్తంగా

### పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. స్వామివారి తొలి అభిషేకం, పూజలను తిలకించారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం ఏర్పాటైంది. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారు అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. ఉప ఆలయాల్లో అర్చకులు పూజాదికాలు నిర్వహించారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పెద్దాపురంలో పోషకాహార కిట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

పెద్దాపురం: పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి అన్నారు. స్థానిక 17వ వార్డు 86, 88 అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజం కోసం ఖర్చుకు వెనుకాడకుండా ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. దీనిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### స్పందనకు ఎనిమిది అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ కార్యాలయ ఏఓ పద్మజ

పెద్దాపురం: డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమానికి సోమవారం ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందాయని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాయలంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థల ఆక్రమణ తొలగించాలని, భూ సర్వే చేయించాలని, విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఎనిమిది అర్జీలు వచ్చాయి. అనంతరం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గణపతి ఆలయంలో పూజలు

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పూజలు చేశారు. కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

### సచివాలయ కార్యదర్శులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న సీనియర్ ఫ్యాకల్టీ శ్రీకైలాస్

సామర్లకోట: సచివాలయ కార్యదర్శులకు సోషల్ మీడియా, డిజిటల్ విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని సీనియర్ ఫ్యాకల్టీ శ్రీకైలాస్ అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం వరకూ శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ఆయా మున్సిపాలిటీలకు చెందిన సీనియర్ అసిస్టెంట్లు నోడల్ అధికారులుగా వ్యవహరించారు.

### సాగునీరు అందించండి

సామర్లకోట: వీకే రాయపురం ఎగువ ప్రాంతానికి చెందిన రైతులు 500 ఎకరాలలో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. అయితే సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతు సంఘ నాయకులు ఇంటి రమేష్, వెలమర్తి శ్రీనివాసు, తలారి దొరబాబు, ఓదూరి నగేష్ అన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# పక్కాగా.. పారదర్శకంగా..

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలులో పారదర్శకతకు పెద్దపీట
- గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం
- ఇంటికే సరకులు అందజేస్తున్న అంగన్‌వాడీలు
- నియోజకవర్గంలో 2958 మందికి లబ్ధి


గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న నాయకులు, అధికారులు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పథకాల అమలులో పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఐసీడీఎస్ ద్వారా అందించే పథకాలలోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఈ నెల నుంచి ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

**318 అంగన్‌వాడీ కేంద్రాలు**

పిఠాపురం నియోజకవర్గంలో 318 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 2958 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరందరికీ ఇంటికే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. పోషకాహారం పంపిణీలో అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం ఎస్‌సీఎం ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. యాప్ వినియోగంపై అంగన్‌వాడీలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. తమ మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న యాప్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు రికగ్నైజ్ చేసుకుంటారు. అనంతరం ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా లబ్ధిదారుల ఫొటోను అప్‌లోడ్ చేసి సరకులు అందిస్తారు.

| నియోజకవర్గంలో వివరాలు | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు | 318 |
| గర్భిణులు | 1525 |
| బాలింతలు | 1433 |

**గర్భిణులు, బాలింతలకు మేలు**

ఇంటికే పౌష్టికాహారం పంపిణీతో గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు జరుగుతుంది. పోషకాహారం పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా ముఖ ఆధారిత ఫొటో విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతినెలా పక్కాగా లబ్ధిదారులకు సరుకులను అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. కోడి గుడ్లు, పాలు రెండు విడతలుగా అందిస్తారు.

దుర్గాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ, పిఠాపురం

# పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


కొత్తపల్లిలో చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వంలో నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి సంవత్సరానికి రూ.24 వేలు అందిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఎక్కడ ? అని ప్రశ్నించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ సానా నాగు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజల శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, సర్పంచులు నక్క మణికంఠబాబు, కర్రి చిన్నారావు, ఉప సర్పంచ్ పొన్నగంటి రామకృష్ణ, చేనేత సొసైటీమాజీ అధ్యక్షుడు యర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూట్రీ గార్డెన్‌పై అవగాహన పెరగాలి


అచ్చంపేటలో మహిళలకు విత్తనాలు అందజేస్తున్న శిరీష

సామర్లకోట: మహిళలు న్యూట్రీ గార్డెన్‌పై అవగాహన పెంచుకోవాలని జీరో బడ్జెట్ న్యూట్రీషన్ ఫార్మింగ్, హెల్త్ అండ్ న్యూట్రీషన్ ప్రత్యేకాధికారి పి.శిరీష అన్నారు. సోమవారం అచ్చంపేట గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహిళలకు న్యూట్రీ గార్డెన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. కుటుంబ సభ్యులంతా మంచి పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. ఇందుకు గాను ఇంటి పెరటిలో పోషక విలువలు కలిగిన కూరగాయలు పండించాలన్నారు. అనంతరం 30 మంది మహిళలకు రిలయన్స్ ఫౌండేషన్ వారిచే 11 రకాల విత్తనాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ మేనేజర్ బి.నాగేశ్వర రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ బి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- అధికారులతో జేసీ ఇలక్కియ సమీక్ష


వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ఇలక్కియ

సామర్లకోట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేసీ ఇలక్కియ సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ స్థానిక జగనన్న లేఅవుట్‌లో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, అక్కడ నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలన్నారు. ఇంటి అద్దెకు చెల్లించే మొత్తం బ్యాంకు వాయిదాలకు చెల్లించడం ద్వారా ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం అవుతుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందని, లబ్ధిదారులు మరో రూ.35 వేలు చెల్లిస్తే థర్డ్ ఆప్షన్‌లో ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని చెప్పారు. దీనికి కూడా లబ్ధిదారులు ముందుకు రాకపోతే వారికి ఇంటి అవసరం లేనట్లు గుర్తించాలన్నారు. ఇప్పటి వరకూ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పేరు పేరునా వివరాలు తెలుసుకున్నారు. సాకులు చెప్పకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి జగనన్న కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌసింగ్ డీఈ రాజు పని తీరుపై జేసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం జరిగే సమీక్షకు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, మెప్మా పీడీ ప్రియంవద, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, డీఎల్‌పీఓ ప్రసాద్, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చేబ్రోలులో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పిఠాపురం: తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు పంచాయతీ వద్ద సోమవారం ప్రగతిశీల పారిశుధ్య కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏఎఫ్‌టీయూ నాయకులు బొత్స ఏసు, డి.నారాయణమూర్తి హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కొరకంటి తాతీలు, దొండపాటి ఏసు, నూకరాజు, గడాల సత్తిబాబు, ఓరుగంటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటుహక్కు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పద్దెనిమిదేళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం స్థానికంగా దొరబాబు క్యాంప్ కార్యాలయంలో బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బూత్ లెవెల్ ఏజెంట్లు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి బూత్ స్థాయిలో ఓటర్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. ఓటరు లిస్టులో పేర్లు, చిరునామా, ఫొటోలు తప్పులుగా ప్రచురితమైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, ఉటా వాసు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నాడు అప్పులు.. నేడు లాభాల్లో సొసైటీలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అగ్రహారం పీఏసీఎస్ పాలకవర్గానికి సత్కారం


సొసైటీ అధ్యక్షుడు మాణిక్యాలరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: పట్టణంలోని అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (సొసైటీ) గత ప్రభుత్వాలు భారీ నష్టాలతో అప్పగిస్తే ప్రస్తుతం లాభాల్లో నడిపిస్తున్నారని పాలక వర్గాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అభినందించారు. పీఏసీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాం (2018–19)లో సొసైటీ రూ.2.69 కోట్ల నష్టాల్లో ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా బొజ్జా మాణిక్యాలరావు (అయలు) అధ్యక్షతన నూతన కార్యవర్గం బాధతలు చేపట్టి నష్టాల్లో ఉన్న సొసైటీని రూ.98 వేల లాభాల్లోకి తీసుకు వచ్చారన్నారు. ఒక పక్క రైతులకు సేవలు అందిస్తూ నష్టాలను పూడ్చి లాభాల్లోకి తీసుకువచ్చిన కార్యవర్గాన్ని ఆయన ఘనంగా సత్కరించారు. నష్టాల్లో ఉన్న సొసైటీని తక్కువ సమయంలో లాభాల్లోకి తీసుకురావడం ప్రభుత్వం అందించిన చేయూత వల్లే సాధ్యమైందని సొసైటీ అధ్యక్షుడు బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

### కళా సేవలకు పురస్కారం



నిర్వాహకుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న కళాకారుడు తురగా సూర్యారావు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన రంగస్థల నటుడు తురగా సూర్యారావుకు నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు ప్రదానం చేశారు. సృజనా ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ హైదరాబాద్ బొగ్గులకుంటలోని సరస్వతీ పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించింది. కళారంగంలో తురగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు ప్రదానం చేశామని క్రియేషన్స్ కార్యదర్శి ఎం.రాజేష్ అన్నారు.

# స్వాతంత్య్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు


స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న జిల్లా స్థాయిలో వేడుకలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్య, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, స్త్రీశిశు సంక్షేమం తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్య్ర దిన వేడుకల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలిచ్చారు. పోలీస్, ఎన్‌సీసీ దళాలతో సంప్రదాయ కవాతుకు ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను కోరారు. వచ్చే అతిథులు, ప్రజలు, అధికారులు తదితరులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో దేశభక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సందేశాలతో అలంకరించిన శకటాలను వేడుకలలో ప్రదర్శించాలన్నారు. ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు తదితరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కాకినాడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, డీపీఆర్‌వో డి.నాగార్జున, డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డీపీవో ఆర్.విక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాశరావు, విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇదిలాఉంటే స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యే అతిథులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ తహసీల్దార్ పి.సీతారావు, ఆర్ఐ దీపక్ ఉన్నారు.

### అధికమాస పవమాన హోమాలు

బోట్‌క్లబ్: అధిక మాసం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సుధా పండితులు ఆధ్వర్యంలో పవమాన హోమాలు నిర్వహిస్తామని ఉత్తరాది మఠ కేంద్ర కమిటీ ప్రత్యేక ప్రతినిధి పండిత కానుగోవి వాసుదేవాచార్ అన్నారు. స్థానిక మధ్వసభలో కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామితో కలసి ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ అనుగ్రహంతో అన్ని ప్రాంతాల్లో విశేష హోమాదికాలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ, విజయనగరం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, గుంటూరులో ఈ కార్యక్రమాలు సుధాపండితుల భాగస్వామ్యంతో మధ్వగృహస్తుల సహకారంతో జరుగుతున్నాయని అన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


కొత్తపల్లిలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


పెద్దాపురంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

- సీనియర్ చేనేత కార్మికులకు సత్కారం
- పలు గ్రామాల్లో ర్యాలీలు

కొత్తపల్లి: స్థానిక ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో సోమవారం శ్రీదుర్గా చేనేత సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించారు. చేనేత కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత దేశంలో చేనేత రంగం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కళా నైపుణ్యత వెలకట్టలేనిదన్నారు. చేనేత కార్మికులకు ఎమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను అందించి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, సర్పంచులు పాలాని దొరబాబు, నక్క మణికంఠ బాబు, ఉప సర్పంచ్ పొన్నగంటి రామకృష్ణ, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

**సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మూలపేటలో చేనేత కార్మికులు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత సీఎం చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉప్పాడలోని రామలింగేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

**చేనేతలకు అండగా ప్రభుత్వం**

పెద్దాపురం: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దాపురం ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీడీఓ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. ఈ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ మూర్తి, సీనియర్ సహాయకులు జగన్నాథం, జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల ఎన్నికకు నేటి నుంచి నామినేషన్లు

కరప: నడకుదురులో ఏడో వార్డు, గొడ్డటిపాలెంలో ఆరో వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశామని, మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీఓ కె.అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 11న నామినేషన్ల స్క్రూటినీ, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కించి, విజేతలను ప్రకటిస్తారు.

# క్రికెట్ ఆడి.. ఉత్సాహపరిచి..


మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో విద్యార్థులతో క్రికెట్ ఆడుతున్న భరత్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్ సోమవారం కాకినాడలో గల్లీ క్రికెట్ ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అక్షయపాత్రకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన వాకలపూడిలోని అక్షయపాత్ర వంటశాలను పరిశీలించడానికి విచ్చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు గాంధీనగర్‌లోని నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో కొంత సమయం క్రికెట్ ఆడారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎల్ రాజు ఉన్నారు.

కాకినాడ రూరల్: అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్‌ను కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ బన్నీ ఘనంగా సత్కరించారు. పెనుమర్తిలో శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకర్ భరత్‌ను శాలువాతో సత్కరించి మెమెంటో ప్రదానం చేశారు. పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.